అధిక ఎరువు.. పంటకు బరువు

- ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే అనర్థమే
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



కడియం ఆవలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కడియం: వరి సాగులో నత్రజని వినియోగం పరిమితికి మించితే అనర్థమేనని అధికారులు చెబుతున్నారు. సంప్రదాయక సాగు విధానంలో రైతులు నత్రజని (యూరియా) వినియోగం ఎక్కువగా చేస్తున్నారని పలు పరిశీలనల్లో తేలింది. ముఖ్యంగా తోటి రైతులతో పోల్చుకుని వారి పైరుకంటే పచ్చగా లేదన్న కారణాన్ని చూపుతూ కూడా నత్రజని వినియోగానికి రైతులు మొగ్గు చూపుతున్నారని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నత్రజని అధిక వినియోగం వల్ల లాభానికంటే నష్టమే ఎక్కువని వివరిస్తున్నారు.

2,620 హెక్టార్లలో వరిసాగు

ప్రస్తుత సీజన్‌లో కడియం మండలంలోని కడియం, వేమగిరి, జేగురుపాడు, కడియపుసావరం, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల గ్రామాల్లో దాదాపు 2,620 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారు. అత్యధికంగా 1121 రకం వాడారు. పంట ఆరోగ్యకరంగానే ఉన్నట్లు వ్యవసాయశాఖాధికారుల పరిశీలనలో తేలింది. ఎరువుల వినియోగంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలనూ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో నత్రజన అధికంగా వినియోగిస్తే ఎదురయ్యే ఇబ్బందులను రైతులకు చెబుతున్నారు. ప్రస్తుతం వరిపైరుపై అక్కడక్కడా ఆకు ఎండు తెగులు కన్పిస్తోంది. ఇది ముఖ్యంగా నత్రజని ఎక్కువ కావడం వల్లగానీ, 26 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల గానీ వస్తుందంటున్నారు. రైతులు పునః పరిశీలించుకుని నత్రజని వినియోగాన్ని నియంత్రించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

ఒకవేళ మరీ ఎక్కువగా ఆకు ఎండుతెగులు ఉంటే ప్లాంటోమైసిన్, బ్లెటాక్స్‌లను పిచికారీ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఒక గ్రాము ప్లాంటోమైసిన్, రెండు గ్రాముల బ్లెటాక్స్‌ల మిశ్రమాన్ని ఒక లీటరు నీటికి కలిపి వినియోగించుకోవాలన్నారు. తద్వారా ఆకు ఎండుతెగులు మరింత వ్యాపించకుండా ఉంటుందని వివరిస్తున్నారు. పూత దశలో గనుక ఆకుఎండు తెగులు వస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరిస్తున్నారు. నత్రజని అధికంగా వినియోగించిన పంట నుంచి వచ్చిన గింజల్లో నూకశాతం కూడా పెరుగుతోందని, ఈ విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. పంట పరిస్థితిని అనుసరించి తగినంత మోతాదులో మాత్రమే ఎరువులను వినియోగించాలన్నారు.

> **తగినంతే వాడాలి**
>
> ఏ ఎరువులైనా తగినంత మాత్రమే వినియోగించాలి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను రైతులు వినియోగించడం మానేశారు. దీనిని వినియోగిస్తే తెగుళ్ల వ్యాప్తి బాగా తగ్గుతుంది. పంట కాలంలో రెండుసార్లు ఎంటీపీ వేయాలి. అనవసరంగా వేసే ఎరువుల వల్ల రైతులకు పెట్టుబడి పెరిగిపోవడం తప్పితే, పంటకు ఏ మాత్రం ఉపయోగం ఉండదు. అధికంగా వాడే ఎరువు మొత్తం వృథాగా భూమిలో ఉండిపోతుంది. ఆకుఎండు తెగులును కడియం ఆవ తదితర చోట్ల గుర్తించాం. సంబంధిత రైతులకు అవగాహన కల్పించాం.
>
> – కె.ద్వారకాదేవి, వ్యవసాయాధికారి, కడియం

క్లుప్తంగా

డీఎంహెచ్ స్కూల్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు గీత

కంబాలచెరువు: ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ పథకం)లో భాగంగా స్థానిక డీఎంహెచ్ స్కూల్‌ను రాష్ట్ర పరిశీలకులు ఎస్. గీత బుధవారం సందర్శించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీ శంకర్, సమగ్ర శిక్షా ప్రణాళిక సమన్వయ కర్త నరసింహారెడ్డి ఆమె వెంట ఉన్నారు. ఈ సందర్భంగా తరగతి గదులు, ఆటస్థలం, లైబ్రరీ, మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. వాటిపై నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజా ప్రశాంత్, సీఆర్పీ జయంతి శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలకు మెటీరియల్ పంపిణీ



టీఎంఎఫ్ స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: అర్బన్‌లోని ప్రభుత్వ మున్సిపల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు స్పోర్ట్స్ మెటీరియల్, టాయిలెట్ నిర్వహణ మెటీరియల్ పంపిణీ చేసినట్టు అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలకు నిర్దేశించిన మెటీరియల్‌ను అందజేశారు. ఈ వివరాలను టీఎంఎఫ్ మొబైల్ యాప్, పాఠశాల రిజిస్టర్‌లో ప్రధానోపాధ్యాయులు నిర్ధారణ చేయాలన్నారు కార్యక్రమంలో సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాస రావు, పబ్బినీడి ప్రసాద్, కుమారి, ఇందిర, నాగలక్ష్మి, కోటేశ్వరి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాజమహేంద్రవరం రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఏ.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్ అన్నారు. కవలగొయ్యి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాలు లభించే పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు ప్రతి ఒక్కరూ సమృద్ధిగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఇంటిలోనే తయారు చేసుకునే పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కవులూరి చంటిబాబు, తీగిరెడ్డి శ్రీను, పల్లేటి చినబాబు, నిశ్చనకోళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా ఎంపికలు



నియోజకవర్గ పోటీలకు ఎంపికైన బాలికలు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని జూబ్లీ మెమోరియల్ ఆర్‌సీఎం హైస్కూల్లో బుధవారం స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో బాలికల అండర్ 17, 14 క్రీడా ఎంపికలు జరిగాయి. వీటిని మండల విద్యాశాఖాధికారులు 1, 2 తులసీదాస్, చందుకుమార్ పర్యవేక్షించారు. వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. వీటిలో విజేతలు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఇబ్రహీం తెలిపారు. మండలంలో పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

చిలుకూరికి పలువురి పరామర్శ

కడియం: మాతృవియోగంతో బాధపడుతున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను బుధవారం పలువురు పరామర్శించారు. వారిలో జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, పాటంశెట్టి రాంజీ, ఉపసర్పంచ్ ముద్రగడ జెమి, సొసైటీ చైర్మన్లు తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం తదితరులు ఉన్నారు.

కడియం ఆవలో పొలంబడి

కడియం: సాగులో రైతులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకునేందుకు పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ శ్రీనివాసరెడ్డి సూచించారు. కడియం ఆవలో బుధవారం మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో సమావేశం

కంబాలచెరువు: పర్యావరణ సవాళ్లు, స్థిరమైన భవిష్యత్తుకు తీసుకునే నివారణలు అనే అంశంపై ఈనెల 15, 16 తేదీల్లో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు బుధవారం తెలిపారు. ప్రపంచం ఎదుర్కొనే పర్యావరణ సవాళ్లు, నివారణల ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పర్యావరణ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పాల్గొంటారన్నారు. సమన్వయకర్త మల్లికార్జున ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం విద్యార్థులకు, శాస్త్రవేత్తలకు ముఖాముఖీ ఏర్పాటు చేశారన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

కడియం: మండలంలోని పొట్టిలంకలో స్థానిక నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, వేద స్పైన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజోఫణీంద్ర 150 మందికి వెన్నెముక, ఎముకలకు సంబంధించి వైద్యపరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే అమీర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వెంటే ప్రజలందరూ..



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- 38వ డివిజన్‌లో గడప గడపకూ..

సీటీఆర్ఐ/ ప్రకాశం నగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలందరూ ఉన్నారని, అయన పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 38 డివిజన్‌లోని వీరభద్రపురం ఆంజనేయస్వామి గుడి నుంచి డివిజన్ ఇన్‌చార్జి, ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అరిగెల బాబు ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఇంటింటికీ పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. పథకాలు అందుతున్న తీరుపై లబ్ధిదారులను ఆరా తీశారు. సీఎం జగన్ పాలనలో మేలు జరుగుతోందని, మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి నిబంధనలు తప్పనిసరి

- ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- ఎస్పీ జగదీష్, కమిషనర్ దినేష్ కుమార్



కార్పొరేషన్ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్

కంబాలచెరువు/ప్రకాశం నగర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాలు, విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీసుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్సవ నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో కమిషనర్ దినేష్ కుమార్, ఎస్పీ పి.జగదీష్ సమావేశం నిర్వహించారు. ఆ ప్రకారం..

- పోలీస్ అనుమతి లేకుండా విగ్రహాలు, పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేయరాదు
- మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి చేసుకోవడానికి కనీసం ఐదుగురు సభ్యులతో కమిటీగా ఏర్పడాలి. వారి పూర్తి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ రిజిస్టర్ చేసుకోవాలి.
- పబ్లిక్ లేదా ప్రైవేటు స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత స్థల యజమాని నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి ఉండాలి, పందిళ్లు, మండపాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలి.
- గణేష్ విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలి. నిమజ్జనానికి ఉపయోగించే వాహనం మంచి కండిషన్‌లో ఉండాలి. లైసెన్స్, అనుభవం ఉన్న డ్రైవర్లను ఉపయోగించాలి.
- రాత్రి వేళల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలి. విగ్రహాల వద్ద తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- వినాయక పందిళ్లు, విగ్రహం పెట్టే ప్రదేశం రోడ్డుపైన ఉండరాదు, ఫ్లెక్సీలతో రోడ్డుపైన రాకపోకలకు అంతరాయం కలిగించరాదు.
- వినాయక చవితి ఉత్సవాల సమయంలో బాణసంచా కాల్చరాదు. ఊరేగింపు సమయంలో పోలీస్ అనుమతి లేకుండా వేషధారణలు, సౌండ్‌బాక్సులు, డీజేలు పెట్టరాదు.
- పందిళ్ల వద్ద, ఊరేగింపు సమయంలో అసభ్య నాట్య ప్రదర్శనలు జరుగకుండా, మద్యం, మత్తు పదార్థాలను సేవించిన వారు లేకుండా ఉత్సవ నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలి.
- వినాయక విగ్రహం ఏర్పాటు చేసిన నిర్వాహకులే తగిన భద్రతా ఏర్పాట్లు చూసుకోవాలి. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉంటే ముందుగానే స్థానిక పోలీస్ అధికారులకు, డయల్ 100కు తెలియపరచాలి.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న మల్లు పోలరాజు తదితరులు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నర్సరీ అసోసియేషన్, కిమ్స్ బొల్లినేని సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎనిమిది విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు ఆనంద్ చౌదరి, మణికంఠ, మహేష్, రేవంత్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. దూర ప్రాంతాల నుంచి శిబిరానికి వచ్చేవారికి రవాణా సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ పాలకవర్గం, నర్సరీ రంగ ప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇటీవల డాక్టరేట్ పొందిన అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుల్లా చంటియ్యను ప్రస్తుత పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

కడియం: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి, తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని రాజమహేంద్రవరం ఏడవ అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి పి.బాబు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం యాంటీ ర్యాగింగ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి బాబు మాట్లాడుతూ ర్యాగింగ్ కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్, ప్యానల్ లాయర్లు జి.మోహన్ వంశీ, వి.సుజాత, ఉపాధ్యాయులు టి.నాగలక్ష్మి, సీహెచ్ లక్ష్మి, సైకాలజిస్ట్ వెంకటకృష్ణ మాట్లాడారు. స్కూలు స్టాఫ్ కార్యదర్శి జి.సత్యనారాయణ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక రివర్‌బే సమావేశ మందిరంలో జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న మూడోదశ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ (ఏపీఎస్ఐఆర్‌డీఅండ్‌పీఆర్) డైరెక్టర్ జే.మురళీ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ, సామర్లకోట ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కొవ్వూరు డీఎల్‌పీవో అమ్మాజీ, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ ఆరమ్‌స్ట్రాంగ్, మాస్టర్ ఆఫ్ ట్రైనీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

కడియం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈవో వి.లజపతిరాయ్, హెచ్ఎం టి.సత్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, కబడ్డీ, టెన్నీకాయిట్, షటిల్, బ్యాడ్మింటన్ తదితర తదితర అంశాల్లో పోటీలు జరిగాయి. మండల స్థాయిలో రాణించిన విద్యార్థులు ఈనెల 15న రాజమహేంద్రవరంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని క్రీడా పోటీల కో ఆర్డినేటర్ ఎం.డేవిడ్ తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధవళేశ్వరం: స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్స్‌లో బుధవారం ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించారు. ఎఫ్‌సీఐ మేనేజర్లు కేఎస్ఎస్ మూర్తి, అల్తాఫ్ హుస్సేన్, కె.నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ రైస్‌లో ఐరన్, బి 12 విటమిన్లతో కూడిన పోషక పదార్థాలు ఉన్నాయన్నారు. రక్తహీనత లోపం ఉన్నవారికి ఈ రైస్ అందిస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు ఈ బియ్యం అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ సిబ్బంది, బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



అమిరుద్దీన్ ఔలియా బాబా సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు



బాబా సమాధిని దర్శించుకుంటున్న కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడిలోని హజరత్ సయ్యద్ అమిరుద్దీన్ ఔలియా బాబా వారి ఉరుసు (గంధోత్సవం) బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. దర్గా అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ అప్సర్, కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా వేల సంఖ్యలో భక్తులు హాజరై ప్రార్థనలు చేశారు. తెల్లవారుజాము నమాజ్ అనంతరం స్థానిక మదర్సా పిల్లలతో ఖురాన్ పఠనం, ఆ తరువాత ఫాతిహా ఖానీతో కొనసాగిన కార్యక్రమాలు నాలుగు గంటలకు దర్గా వద్దకు ఊరేగింపుగా గంధం చేరుకోవడంతో ముగిశాయి. ఈ సందర్భంగా వచ్చిన భక్తులందరికీ దర్గా వద్దే అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ రబ్బానీ, జాయింట్ సెక్రటరీ సయ్యద్ అల్తాఫ్, సెక్రటరీ అబూ బకర్, సయ్యద్ గౌస్ రఫీ పాల్గొన్నారు. అలాగే గంధోత్సవంలో వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల దీక్ష

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు కాతేరులో మాజీ వైస్ ఎంపీపీ గంగిన హనుమంతరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం రిలే దీక్ష చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: పురుగుమందు తాగిన వ్యక్తి.. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దివాన్ చెరువు గ్రామానికి చెందిన అక్కిరెడ్డి రామకృష్ణ (63) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య సీత దివాన్ చెరువు సెంటర్‌లో కూరగాయలు వ్యాపారం చేస్తోంది. ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం తన గ్రహచారం బాగోలేదని, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయంటూ పురుగు మందు తాగాడు. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ఆదివాసీల పాత్రపై పరిశోధన

రాజానగరం: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆదివాసీలపై పరిశోధన జరిపి, నేటి తరానికి అందించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీయుల పాత్ర అనే అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్ – న్యూఢిల్లీ) మేజర్ ప్రాజెక్టుకు నన్నయ వర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావును డైరెక్టర్‌గా, అధ్యాపకులు డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర, డాక్టర్ ఆర్.సాంబశివరావు, డాక్టర్ జె.రాజామణిలను కో డైరెక్టర్లుగా ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు పత్రాలను వీసీ వారికి బుధవారం అందజేస్తూ, అభినందనలు తెలిపారు.

ఓజోన్ డే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నారాయణ తదితరులు

కంబాలచెరువు: వరల్డ్ ఓజోన్ డే (ఈనెల 16) సందర్భంగా ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఓజోన్ డే పోస్టర్‌ను రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఈఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వరల్డ్ ఓజోన్ డే నిర్వహించి, విద్యార్థులకు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ సమన్వయకర్త కె.సతీష్ బాబు, సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ నెహ్రూ, సీఎంఓ శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.





